

నేటి దినపత్రిక
# సూర్య
ఉత్తరాంధ్ర

శనివారం
26-10-2024
పేజీలు 4

www.suryaa.com

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం


### కేంద్ర హోంశాఖ సంప్రదింపులు కమిటీ సభ్యులుగా
## అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేష్



అనకాపల్లి ప్రతినిధి, అక్టోబర్ 25, మేజర్‌న్యూస్

వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కమిటీల్లో రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలకు చోటు లభించిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సంప్రదింపులు కమిటీ సభ్యులుగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం.రమేష్ నియమితులయ్యారు. ఈ కేంద్ర హోం శాఖ సంప్రదింపుల కమిటీకి చైర్మన్‌గా హోంమంత్రి అమిత్ షా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో సహాయ మంత్రులుతో పాటు 15 మంది లోక్సభ, 13మంది రాజ్యసభ, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు అని కేంద్రం నుండి అధికారిక ఉత్తర్వులు జారీ

# రాష్ట్ర పర్యాటక రంగానికి పునర్ వైభవం

**కొత్త టూరిజం పాలసీ రూపొందిస్తున్నాం.. ఏప్రిల్ 2025 నుండి అమల్లోకి రానున్న పర్యాటక హిత పాలసీ -పర్యాటకులను ఆకర్షించేలా, స్టేక్ హోల్డర్లకు అనుకూలంగా ఉండేలా పాలసీ రూపకల్పన -ఫిల్మ్ టూరిజం డెవలప్ మెంట్ కు ఏపీ అనుకూలం.. తెలుగు సినీ ఇండస్ట్రీతో చర్చించి ఏపీలో చలనచిత్ర అభివృద్ధికి చర్యలు : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**

విశాఖపట్నం,అక్టోబర్ 25, మేజర్ న్యూస్




2025-30కి సంబంధించి 5 ఏళ్లకు కొత్త టూరిజం పాలసీని రూపొందిస్తున్నామని తద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగానికి పునర్ వైభవం వస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం విశాఖపట్నంలోని హోటల్ ఫోర్ పాయింట్స్ బై షెర్టాన్‌లో జరిగిన సీఐఐ టూరిజం అండ్ ట్రావెల్ సమ్మిట్‌లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించడం శుభపరిణామని, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా సదస్సులో మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. ఏప్రిల్ 2025 నుండి కొత్త పర్యాటక హిత పాలసీ అమల్లోకి రానుందన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా, స్టేక్ హోల్డర్లకు అనుకూలంగా ఉండేలా పాలసీ రూపకల్పన చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 27న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ పర్యాటక దినోత్సవంలో రాష్ట్ర పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారని తెలిపారు. ఇండస్ట్రీలకు ఇచ్చే బెనిఫిట్స్ అన్నీ టూరిజానికి కూడా కల్పిస్తామన్నారు. పర్యాటక అభివృద్ధి కోసం ప్రాజెక్ట్ లతో ముందుకు వస్తే ప్రభుత్వ పరంగా రాయితీలు కల్పిస్తామన్నారు. మొత్తం ఉపాధి మిగతా 2లో




# విశాఖ ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు

**విశాఖ నగరం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 45 నిమిషాల్లో చేరుకునేలా రోడ్లు -మెట్రో కారిడార్, రోడ్ల విస్తరణకు కార్యాచరణ... మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వచ్చేలా చర్యలు -విశాఖపట్టణం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించిన ఇన్ఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి -భాగస్వామ్యమైన ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, సీపీ, జేసీ, వీఎంఆర్డీఏ కమిషనర్, ఇతర అధికారులు**

విశాఖపట్నం, అక్టోబర్ 25, మేజర్ న్యూస్



విశాఖ మహా నగరం ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలని జిల్లా ఇన్ఛార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఆర్థికంగా రోజురోజుకూ ఎదుగు తున్న విశాఖ నగర గౌరవాన్ని, ప్రతిష్టతను కాపాడుకునేలా సమష్టి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాలుష్య నివారణకు తగిన మార్గాలను అన్వే షిస్తూ... పరిశోధనలు చేసి, నిబంధనలను కఠిన తరం చేయాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఇన్ఛార్జి మంత్రి విశాఖ పట్టణం జిల్లా అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా, రూల్ పొజిషన్ ప్రకారం పని చేసే అధికారులకు మద్దతుగా ఉంటామని చెప్పిన ఎంపీ శ్రీభరత్ మాటలను సమర్ధిస్తూ మంత్రి హామీ ఇచ్చారు. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎక్కువగా సైక్లోన్లు వచ్చే ప్రాంతం కాబట్టి విశాఖ మహా నగరం పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లాలోని చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి, జిల్లా స్థితిగతుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రజెంటేషన్ ఇస్తూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని, దానిలో భాగంగా గస్తీ పెంచామని, డ్రోన్లను వినియోగిస్తున్నామని చెప్పారు. సాకేంతిక పరిజ్ఞానం సాయంతో సైబర్ నేరాలను అదుపు చేశామని, చాలా అంశాల్లో మంచి ఫలితాలు సాధించామని వివరించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

**భోగాపురం విమానాశ్రయానికి సులువుగా చేరుకునేలా రోడ్లు వేయాలి : జీఎంఆర్**

జీఎంఆర్ గ్రూప్ ప్రతినిధులు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో విశాఖపట్టణం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు సులువుగా ఉండేలా రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. లంకెలపాలెం నుంచి తగరపువలస వరకు 12 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, ఆయా చోట్ల ఫ్లై ఓవర్లు వేయాల్సి ఉందని ప్రతిపాదించారు. ఇప్పుడున్న జాతీయ రహదారి - 16, రాష్ట్ర రహదారిని విస్తరించాలని సూచించారు. నాగ్ పూర్

### పెదముషిడివాడలో
## పేదోళ్ల ముసుగులో నిర్మాణాలు!

**రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం**



పరవాడ, అక్టోబర్ 25, మేజర్‌న్యూస్

వారంతా కడు పేదవారు ప్రభుత్వ స్థలంలో లక్షలాది రూపాయలతో పెద్ద పెద్ద ఇళ్లను నిర్మించుకుంటున్నారు వారికి అందరూ సహాయం చేద్దాం అంటూ కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని పప్పు బెల్లాళ్ళ భూ భకాసురులు పంచుకుంటున్న ఘటన మండలంలో గల పెదముషి డివాడలో చోటుచేసుకుంది. గత కొంతకాలంగా పేదల ముసుగులో లక్షలాది రూపాయలతో ప్రభుత్వ భూములు అక్రమణలు పెరిగిపోయిన సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోలేని పరిస్థితి ఇక్కడ ఏర్పడింది. రాజకీయంగా మిగతా 2లో

# ప్రతి మూడు సంఘాలకు విఓఏలను మార్చుకోవచ్చు

**కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే వెండార్‌షిప్ అమలు చేస్తున్నాం -గత ప్రభుత్వ హయాంలోనే వెండార్‌షిప్‌పై ఆదేశాలు వచ్చాయి -రూ.350 కోట్లతో జిల్లాలో ఉపాధి పనులు : మీడియాతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

విజయనగరం బ్యూరో, అక్టోబరు 25, మేజర్‌న్యూస్



స్వయంశక్తి సంఘాలు ప్రతి మూడేళ్లకు విఓఏలను మార్చుకొనే అవకాశం డ్వాక్రా సంఘాలకు వుందని రాష్ట్ర సెర్ప్, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, ఎన్.ఆర్.ఐ. వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఆయా సంఘాలు తీర్మానం ద్వారా విఏఓలను మార్చుకోవచ్చన్నారు. జిల్లాపరిషత్ సమావేశం అనంతరం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలసి శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాకు ఉపాధిహామీ నిధులు రూ.350 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, యీ నిధులతో గ్రామాలకు రోడ్లు వంటి మౌళిక వసతులను పెద్ద ఎత్తున కల్పించుకొనే అవకాశం వుందన్నారు. వెండార్‌షిప్ ద్వారా ఉపాధిహామీ పనుల్లో కాంట్రాక్టు వ్యవస్థ వస్తుందనే అపోహ సభ్యుల్లో వుందని, వెం డార్‌షిప్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలోనే ప్రవేశపెడుతూ ఆదేశాలు జారీచేశారని చెప్పారు. వాటినే తాము అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ గత ప్రభుత్వం కేంద్ర ఆదేశాల మేరకు వెండార్‌షిప్ ను ప్రవేశపెడుతూ ఇచ్చిన ఆదేశాల మేరకు మాత్రమే తమ ప్రభుత్వం ఉపాధిపనులు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం జారీచేసిన నిబంధనల ప్రకారమే అధికారలు ఉపాధి పనులు చేపడతారని పేర్కొన్నారు. ఉపాధి పనులకోసం తాము రూ.386 కోట్లు తీసుకువచ్చామన్నారు. గ్రామాల్లో పనులు ఆగినట్లయితే ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. ఉచిత ఇసుకను ప్రజలు తమ వ్యక్తిగత అవసరాల కోసం గ్రామానికి సమీపంలోని గెడ్డ, వాగుల నుంచి ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లపై తెచ్చుకోవచ్చని ప్రభుత్వం అనుమతి ఇస్తోందన్నారు. మీడియా సమావేశంలో ఎం.పి కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యులు అదితి గజపతి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు.

### తాగునీటి పంపిణీ పట్ల
## బాధ్యతయుతంగా పనిచేయాలి

**విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య**



విజయనగరం టౌన్, అక్టోబరు 25, మేజర్‌న్యూస్

తాగునీటి పంపిణీ పట్ల బాధ్యతయుతంగా పనిచేయాలని, నీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని ఎమినిటీస్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఈరోజు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు వృధా కాకుండా చూడాలన్నారు. అలాగే పైప్లైన్ లీకేజీలు ఉన్నట్లయితే వాటిని యుద్ధ ప్రాతిపదికన సరి చేయాలని చెప్పారు. అనుక్షణం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తాగునీటి పంపిణీ పట్ల ఇబ్బందులను ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలన్నారు. నీటి పంపిణీ ఉదయం 9 లోపే జరగాలని చెప్పారు. మధుపాడ నుండి వచ్చే నీటి పంపిణీ పట్ల జాగ్రత్త వహించాలన్నారు. నవంబర్ నెలాఖరు కల్లా గుంతలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ టి.రాయల్ బాబు, డి ఈ లు శ్రీనివాసరావు, మణికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

# 27న బీచ్‌లో 'విక్టరీ ఎట్ సి' స్తూపంపై లేజర్ షో

**ప్రజలందరూ తిలకించండి : జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్ రాజు**

విశాఖపట్నం, అక్టోబరు 25, మేజర్‌న్యూస్




మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా అక్టోబర్ 27 (ఆదివారం) సాయంత్రం 7 గంటల నుండి బీచ్ రోడ్డులో వైఎంసిఏ సమీపంలో వున్న 'విక్టరీ ఎట్ సీ" స్థూపముపై సౌండ్, లేజర్ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్ రాజు పత్రికా ప్రకటన ద్వారా శుక్రవారం తెలియజేశారు. జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ప్రజల వీక్షణ కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ లేజర్ షోలో 1971 నౌకాదళం యుద్ధం, విశాఖ నగరం యొక్క పాత్ర, యుద్ధ వీరుల సాహసాలతో పాటు దేశ చరిత్రను తెలిపే విధంగా అద్భుతమైన లేజర్ షో నిర్వహించడం జరుగునన్నారు. ఇప్పటికే సెప్టెంబర్ రెండవ తేదీన ట్రయల్ రన్‌గా 'విక్టరీ ఎట్ సి' స్తూపంపై ఈ లేజర్ షోను ప్రదర్శించడం జరిగిందని, ఇకపై ప్రతి ఆదివారం ప్రజల వీక్షనార్థం ప్రదర్శించడం జరుగుతుందని ప్రధాన ఇంజనీర్ తెలిపారు. అక్టోబర్ 27, 2024 ఆదివారం సాయంత్రం 7 గంటలకు బీచ్ రోడ్డులో వైఎంసిఏ మిగతా 2లో

# కష్టపడే వాళ్లకు గుర్తింపు

**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి**



విశాఖపట్నం, అక్టోబర్ 25, మేజర్ న్యూస్

కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని రాష్ట్ర సాంఘిక శాఖ మాత్యులు జిల్లా ఇన్చార్జ్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన విస్తృత స్థాయి మిగతా 2లో

# కేజీహెచ్‌లో మేజర్.. ఆమ్యామ్యాల్లో మేనేజర్..!

**ఏసీబీ కేసుల్లో ఉన్న వారికే సూపర్ సీట్లు -ఫైళ్లు రాయలేని వారికి గమ్మత్తు కేసులు -అన్నీ తానై నడిపిస్తున్న 'జవహరా'యణం -చూసీ చూడనట్టు నటిస్తున్న శివానందం**




విశాఖపట్నం, అక్టోబర్ 25, మేజర్‌న్యూస్

విశాఖ కేజీహెచ్ అంటే ఓ బ్రాండ్...ఉత్తరాంధ్రకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్యులకు ఇదొక దేవాలయం. ఇక్కడ ఉద్యోగం అంటే ఆషామాషీ కాదు. అందుకే ఇక్కడ ఓ ఏడాది అయినా ఉద్యోగం చేయాలని కలలు కంటుంటారు. అలాంటి చోట ఒకే ఒక్క వ్యక్తి దాదాపు అయిదేళ్లు...పదేళ్లు కాదు...ఏకంగా 20 ఏళ్లకు పైగా కేజీహెచ్‌లోనే కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారంటే అంత ఆషామాషీ కాదు. అందుకు ఆ ఆస్పత్రికి ఏ సూపరింటెండెంట్ వచ్చినా ఆయనకు సలాం చేస్తున్నారంటే ఆయన ఎంత మేజరో... ఊహించుకోవచ్చు. ఆయన మేనేజర్‌గా ఇటీవల అయ్యారు కానీ అంతకు ముందు నుంచీ ఆయన అన్ని వ్యవస్థలను తమ కనుకూలంగా మలచుకోవడంలో మేనేజర్ అయ్యారనే సంగతి అక్కడ ఏ ఉద్యోగస్తుడిని అడిగినా ఇట్టే చెబుతున్నారు.

**ఆదాయ మార్గాలన్నీ ఆయన చేతుల్లోనే..!**

కేజీహెచ్‌లో మేజర్‌గా చెప్పుకునే జవహరాయాణం చేతుల్లోనే అన్ని ఆదాయ మార్గాలున్నాయి. అందుకే కేజీహెచ్‌కు సూపరింటెండెంట్ బాస్ అయినా ఆ బాస్ సైతం మేజర్ చెప్పే చిలక జోశ్యానికి సంతకం చేయాల్సిందే. అందుకే అసలు సిసలైన కీలక ఫైళ్లు ఆయన కనుసన్నల్లోంచే బయటకు వస్తున్నాయంటే ఆయన రేంజ్ ఏంటో ఈ పాటికే ఊహించుకోవచ్చు. విశాఖలో భారీ ఎత్తున కార్పోరేట్ ఆస్పత్రులు వస్తున్నాయి. వీటన్నింటికీ అనుమతులు ఇవ్వడానికి పరిశీలించాల్సిందంతా ఈ దొరలే... అంత ఈజీగా అయితే అనుమతులు ఇస్తారా...రూ. వందల కోట్ల పెట్టుబడితో పెట్టే ఈ కార్పోరేట్ ఆస్పత్రులకు ఎన్ఓసీలు ఇచ్చేది అంత సులువు అనుకుంటే పప్పులో కాలేసినట్టేగా..అందుకే వీళ్ల మిగతా 2లో

# ట్రాక్టర్ యజమానులే.. అసలు దొంగలు!

**దేవరాపల్లిలో ఆగని ఇసుక దందా -అడ్డు అదుపు లేకుండా అక్రమ రవాణా -దోచుకున్న వారికి దోచుకున్నంత -ప్రభుత్వ నిబంధనలకు తూట్లు -అటువైపు కన్నెత్తైనా చూడని అధికారులు -ఉచిత ఇసుక ఎక్కడ.. ఇక్కడ మాత్రం పైకం కట్టాల్సిందే**

దేవరాపల్లి, అక్టోబర్ 25, మేజర్‌న్యూస్

మండలంలోని శారదా నదిలో అక్రమంగా ఇసుక దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోతుంది. దీనిపై అధికారులు పట్టించుకోక ఒకరిని చూసి మరొకరు పోటా పోటీగా ఇసుక తరలిస్తున్నారు. మండలంలోనితామరబ్బా, తిమిరాం, కలిగొట్ల, బోయిల కింతాడ, తెనుగుపూడి పంచాయతీ విస్సరపు వీధి సమీపంలోని శారదా నదిలో గురుకులం ప్రహరీ గోడకి ఆనుకొని ఉన్న శారదా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుకను తోడేళ్లులా తోడేస్తున్నారు. పగలు రాత్రి వేళల్లో ఈ ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. ఇసుకుని తరలించి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. శారదా నది సమీపంలోకి టైరు బళ్ళు, ట్రాక్టర్లతో దంపుచేసి, రాత్రి వేళల్లో లారీలతో ఇసుక తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న కనీసం పోలీస్, రెవెన్యూ అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం ఉందంటూ ఆయ గ్రామల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ ట్రాక్టర్లు, లారీల మిగతా 2లో



## కేంద్ర హెూంశాఖ సంప్రదింపులు కమిటీ సభ్యులుగా ..

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. దీనిపై ఎంపీ సీ.ఎం రమేష్ స్పందిస్తూ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో కీలకమైన రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ గా మరియు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ,ఫైనాన్స్ కమిటీ సభ్యునిగా మరియు ఇప్పుడు హెూం శాఖ సంప్రదింపులో కమిటీలో సభ్యునిగా తనను నియమించినందుకుగాను ప్రధాని నరేంద్ర మోడీకి కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా కి మరియు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.తనను నమ్మి గురుతరమైన బాధ్యతలు అప్పగిస్తూ, ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహిస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోడీ కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు.అదేవిధంగా అనకాపల్లి జిల్లావ్యాప్తంగా శుభాకాంక్షలు తెలియజేసిన కూటమి నాయకులకు,కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రాష్ట్ర పర్యాటక రంగానికి పునర్ వైభవం

(మొదటి పేజీ తరువాయి)

కల్పనలో టూరిజం ద్వారా కనీసం 20 శాతం ఉద్యోగాలు కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి తెలిపారని మంత్రి వివరించారు. రాష్ట్ర పర్యాటకానికి సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో ఊరట ఇచ్చే మాట చెప్పారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. వివిధ వర్గాల నుంచి తీసుకున్న సమాచారంతో కార్యాచరణ ప్రారంభించామన్నారు. కేరళ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని వనరులున్నాయని అందులో భాగంగా 974 కి.మీల సుదీర్ఘ తీర ప్రాంతం, పదుల సంఖ్యలో బీచ్ లు, అపార సహజ వనరులు, నదులు, చరిత్ర, సంస్కృతి, ప్రాచీన ఆలయాలు, బౌద్ధారామాలు, వన్య ప్రాణి అభయారణ్యాలు, జాతీయ పార్క్ లు ఇలా ఎన్నో విధాలుగా పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలు ఉన్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేలా టెంపుల్, ఎకో, అడ్వెంచర్, వెల్ నెస్, అగ్రి టూరిజంలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తున్నామని తద్వారా సత్ఫలితాలు సాధిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల కృషితో కేంద్ర ప్రభుత్వం సై తం స్వదేశీ దర్శన్, ప్రసాద్ తదితర పథకాలతో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని వృద్ధి చేయడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. వందల కోట్ల కేంద్ర ప్రభుత్వ పర్యాటక పథకాల నిధులతో పర్యాటకాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహకారం ఉంటుందని దక్షిణాది రాష్ట్రాల పర్యాటక మంత్రుల సదస్సులో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటక ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేశామని త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రాష్ట్రంలో బీచ్ టూరిజం అభివృద్ధి చేసి జనవరిలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సినిమాలు, లఘు చిత్రాల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రాచుర్యం కల్పిస్తామన్నారు. దేశంలో 3వ అతిపెద్ద సముద్రతీరం ఏపీలో ఉన్నప్పటికీ కేవలం రుషికొండ మాత్రమే బ్లూఫాగ్ బీచ్ గా ఎంపికైందని దానితో పాటు అందమైన కాకినాడ, సూర్యలంక, మైపాడు, రామాపురం బీచ్ లున్నాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అక్రమాల వల్ల పర్యాటక రంగం కుంటుపడిందని తద్వారా పర్యాటకంగా రాష్ట్రం చాలా నష్టపోయిందని మంత్రి విమర్శించారు. ఎండో మెంట్, ఫారెస్ట్, టూరిజం మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధికి అవసరమైన సలహాలు తీసుకొని ముందుకెళ్తామన్నారు. రాష్ట్రంలో అధ్యాత్మిక ప్రాంతాలుగా తిరుపతి, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం తదితర ప్రాంతాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 90 శాతం మంది అధ్యాత్మిక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులేనని ఈ క్రమంలో ఉదాహరణకు సింహాచలం లాంటి ప్రాంతానికి పర్యాటకుడు వస్తే సమీపంలోని లంబసింగి, అరకులోయ, మారేడుమిల్లి తదితర ప్రాంతాలను సందర్శించేలా సర్క్యూట్ లు అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని తద్వారా ఆయా ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు మూడు, నాలుగు రోజుల పాటు ఉండే విధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రిసార్ట్ లు, జంగిల్ సఫారీలు, రోప్ వేలు, ఐకానిక్ బ్రిడ్జిలు, అడ్వెంచరస్ యాక్టివిటీస్, వాటర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ద్వారా టెంపుల్ టూరిజంతో పాటు ఎకో టూరిజం డెవలప్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా తొట్లకొండ, శాలిహుండం తదితర ప్రాంతాల్లో బౌద్ధారామాలు అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో భాగంగా నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ నగరంగా దక్షిణ భారత దేశంలో విశాఖకు చోటు కల్పించడం గర్వించదగ్గ అంశమన్నారు. విశాఖపట్నంను క్రూయిజ్ హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు. విశాఖపట్నం నుండి చెన్నై, పుదుచ్చేరి ప్రాంతాలకు వెళ్లేలా లగ్జరీ క్రూయిజ్ లు ఏర్పాటు చేసి క్రూయిజ్ టూరిజం డెవలప్ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒబెరాయ్, తాజ్ లాంటి ప్రఖ్యాత సంస్థలు ముందుకొచ్చాయని, పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హెూటళ్లు పెడతామని చెప్పడం సంతోషకరమన్నారు. ఏపీలో సినీరంగం అభివృద్ధి చెందాలని మంత్రి కందుల దుర్గేష్ కాంక్షించారు. రాష్ట్రంలో ఫిల్మ్ టూరిజం అభివృద్ధి చెందేందుకు మంచి అవకాశాలున్నాయని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. చిత్రపరిశ్రమ అభివృద్ధికి విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. విశాఖలో షూటింగ్స్ కోసం సింగిల్ విండో సిస్టం తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో ఫిల్మ్ టూరిజం డెవలప్ మెంట్ కు సంబంధించి ఏ పాలసీలు అమలు చేస్తే బాగుంటుందో సూచించాలని సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ ను కోరారు. పీపీపీ విధానంలో ముందుకెళ్లి అభివృద్ధి చేసుకుందామని సూచించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సినిమా షూటింగ్ జరుగుతున్నాయని, ఇదే క్రమంలో చిత్ర పరిశ్రమను వృద్ధి చేసుకోవాల్సిన అవసరముందని మంత్రి అభిప్రాయపడ్డారు. తద్వారా పలువురికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ విషయంపై సినీ ఇండస్ట్రీ పెద్దలతో విజయవాడలో సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చిద్దామన్నారు. సినిమా ఇండస్ట్రీ కోరిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఇప్పటికే టికెట్ల రేట్ల విషయంలో తాము చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే షూటింగ్ లకు సంబంధిత ప్రాంతాల పేర్లను ప్రదర్శించాలని కోరారు. తద్వారా ఏపీ టూరిజం మరింత వృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రుషికొండ భవనాలను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై నెలరోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ ఎం. శ్రీభరత్, సురేష్ ప్రొడక్షన్స్ సీఈవో, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, సీఐఐ విశాఖపట్నం ఛైర్మన్ రాజేష్ గ్రంధి, సీఐఐ విశాఖపట్నం వైస్ ఛైర్మన్ వి.అజయ్ కుమార్, సీఐఐ టూరిజం ప్యానెల్ కన్వీనర్ రాజీ ఇందుకూరి, జేఎల్ఎల్ ప్రతినిధి జెర్రి కింగ్స్లే, సీనియర్ డైరెక్టర్ ఎస్. రాబిన్, సీఐఐ ప్రతినిధులు వి. మురళీకృష్ణ, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎస్. రాజారెడ్డి, ఇమాజికా వరల్డ్ ఎంటర్టైన్ మెంట్ లిమిటెడ్ సీఈవో ధీమంత్ బక్షి, హాలిడుస్ బిజినెస్, యాత్రా ఆన్ లైన్ లిమిటెడ్ సీఓఓ క్రిషన్ సింగ్, హాలిడే వరల్డ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ మోహన్, బుక్ మై షో వర్ధన్ సిగటాపు, నీతి ఆయోగ్ కన్సల్టెంట్ మన్వేంద్ర జైన్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

డబుల్ డెక్కర్ మోడల్ లో రోడ్లు వేయాలని, బీచ్ రోడ్డును అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్థానిక ఎంపీ శ్రీభరత్ స్పందిస్తూ ప్రస్తుత జాతీయ రహదారిని విస్తరించాలంటే... మెట్రో ప్రాజెక్టు కారిడార్ ఓ కొలిక్కి రావాలని, అప్పుడే సమాంతరంగా పనులు చేద్దామని అభిప్రాయపడ్డారు. బీచ్ రోడ్డును అనుసంధానం చేస్తే... వాహనాల వేగం పెరుగుతుందని, ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో భాగంగా జిల్లా ఇన్ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వివిధ అంశాలపై మాట్లాడారు. దేశంలోనే అత్యధికంగా ఆదాయ వనరులు కలిగిన నగరం విశాఖపట్టణం అని.. అభివృద్ధికి ఇక్కడ అన్ని రకాల అవకాశాలు ఉన్నాయని, దానికి అనుగుణంగా ముందుకు సాగుదామని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలని, పరిశ్రమలు రావాలని, జీవీఏ పెరగాలని దానికి సమష్టి కృషి అవసరమని అన్నారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపుదామని, ప్రజలకు మంచి సేవలందిద్దామని మంత్రి పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వీలైనంత త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా చెప్పారు. పంచ గ్రామాల సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం తీసుకొద్దామని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం మరింత పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా ప్రజలకు ఒకటో తేదీనే 98 శాతం ఫించన్లు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఉద్యోగ కల్పన, సేవల విస్తరణ, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రధాన దృష్టి సారించి ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

### 25 ఎకరాల్లో విభిన్న ప్రతిభావంతులకు క్రీడా మైదానం

రాష్ట్ర ప్రభుత్వం విశాఖకు మంచి చేసేందుకు అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉందని మంత్రి పేర్కొంటూ.. ఇప్పటికే విభిన్న ప్రతిభావంతుల కోసం 25 ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. దీని కోసం రూ.200 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. అలాగే దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి వస్తుందని తెలిపారు. 48 గంటల్లో సంబంధిత డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. జిల్లాలోని అధికారులు ప్రజా ప్రతినిధులకు అన్ని విధాలుగా సహకారం అందించాలని హితవు పలికారు. అధికారులు స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎన్.డి.ఎ. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని, దీనిలో భాగంగా ఇప్పటికే కేంద్రం కూడా సహాయం అందించిందని గుర్తు చేశారు. సీఎస్ఆర్ నిధులతో కేజీహెచ్ లో ఓపీ బ్లాక్ ను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి సూచించారు.

### పలు సమస్యలను నివేదించిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పరిపాలనాపరమైన అంశాల్లో అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని, కాలయాపన చేయరాదని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేసే అధికారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యాక్టివ్ గా ఉండే ఉద్యోగులకు ప్రోత్సాహం, డల్ గా ఉండే ఉద్యోగులకు పనిష్మెంటు ఉంటుందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇలాంటి వారిపై ప్రత్యేక పరిశీలన, చర్యలు ఉండాలని కలెక్టర్ కు సూచించారు. రుషికొండ సమీపంలోని కొత్తగా వేసిన రోడ్డును ఓపెన్ చేయాలని మంత్రిని కోరారు. దీని వల్ల పర్యాటకం పెరుగుతుందని పేర్కొన్నారు. గాజువాక ప్రాంతంలో కన్వెన్షన్ డీడ్, 22ఏ భూముల విషయంలో సడలింపులు ఇవ్వాల్సి ఉందని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు పరిహారం, ఉద్యోగాల కల్పన గురించి చెప్పారు. జెట్టీ నిర్మాణం చేపట్టాల్సి ఉందని తెలిపారు. పోర్టులో ఉంచే నిల్వలపై కెమికల్ స్ప్రేయింగ్ చేయాలని, దీనిపై పరిశోధన చేయాలని పేర్కొన్నారు. పొల్యూషన్ బోర్డు మెంబర్ సెక్రటరీ విశాఖలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచవటి భూస్వాములకు పరిహారం, ఇళ్ల పట్టాల మంజూరు, నిర్మాణాల విషయంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, దానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సూచించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నావల్ డాక్ యార్డులో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉద్యోగులకు కల్పించాలని కోరారు. హుద్ హుద్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని సూచించారు. పంచగ్రామాల సమస్యను ఓ కొలిక్కి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సదరం స్లాట్ల బుకింగులో ఇబ్బందులను తొలగించాలని, దొంగతనం కేసుల్లోని బంగారాన్ని రికవరీ చేయాలని పేర్కొన్నారు. డెత్ సర్టిఫికేట్ల జారీలో ఇబ్బందులను తొలగించాలని, నివాసాల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రస్తావించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పగటి పూట చేపట్టరాదని, ఫ్యామిలీలు ప్రయాణించేటప్పుడు పోలీసులు జాగ్రత్త వహించాలని చెప్పారు. నగరంలో హెూల్ సేల్ మార్కెట్ ను ఏర్పాటు చేయాలని, అనువైన స్థలం కేటాయించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. మత్స్యకారులకు గతంలో ఇవ్వాల్సిన పరిహారం, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విన్నవించారు. ప్రజాప్రతినిధుల రిఫరెన్సును పరిగణలోకి తీసుకోవాలని, అధికారులు త్వరితగతిన స్పందించాలని ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవి రావు పేర్కొన్నారు. కాలుష్య నివారణలో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మంచి ప్రభుత్వం అనే నినాదాన్ని పాటిస్తూ ప్రజలకు సత్వరమే సేవలందించాలని సూచించారు. అధికారులు కార్యాలయాల్లో సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాధుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అపార్, యు డైస్ ఆన్లైన్ వేగవంతం చేయాలి : ఎంఈఓ

నరసన్నపేట, అక్టోబర్ 25, మేజర్న్యూస్:



జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు మేరకు నరసన్నపేట మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల నిర్వహకులు, ప్రిన్సిపల్స్ తో మండల విద్యాశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. Appar ఆన్లైన్లో స్కూల్ వైస్ అప్డేట్ చేయాలని , యు డైస్ ప్లస్ లో అప్డేట్ చేయాలని ఫార్మేటివ్ అసెస్మెంట్ -1పెండింగ్ మార్క్స్ అన్ని స్కూల్స్ లాగిన్స్లో అప్డేట్ చేయాలి అని మండల విద్యా శాఖ అధికారులు తెలియజేశారు. మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, సిఆర్ఎంటిలతో సమావేశం నిర్వహించిన మండల అధికారులు అపర్, యుడైస్ పనులు వేగవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిఆర్ఎంటిలు వాళ్ళ పరిధిలోని పాఠశాలలు ఆన్లైన్ వివరాలు వెంటనే ఆఫీసుకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## బాడంలో అక్రమ బాణాసంచా స్వాధీనం

నరసన్నపేట, అక్టోబర్ 23, మేజర్న్యూస్:



నరసన్నపేట మండలం బాడంగ్రామంలో అనధికారంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్సై సిహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలోని పోలీసులు బాడం గ్రామంలో సోదాలు నిర్వహించి బాణసంచాను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి బాణా సంచను నరసన్నపేట పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ బాణా సంచి విలువ సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఉంటుందని ఎస్సై తెలియజేశారు.

## మంత్రి కింజరాపు అచ్చం నాయుడు కలిసిన మత్స్యకార సంఘ ప్రతినిధులు

నరసన్నపేట, అక్టోబర్ 25, మేజర్న్యూస్:



నరసన్నపేట శ్రీ సంతోషిమాత మత్స్యకార సంఘ ప్రతినిధులు నరసన్నపేట మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు కలిసి తమ సమస్యలు తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించాలని మత్య శాఖ ఏడి ని ఆదేశించారు. తమ సమస్యలపై మంత్రి సానుకూల దృక్పథంతో వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపినందుకు మత్స్యకార సంఘ ప్రతినిధులు వ్యవసాయ మంత్రి అచ్చంనాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోయిన సతీష్ మత్స్యకార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదులో పాల్గొనాలి

నరసన్నపేట, అక్టోబర్ 25, మేజర్న్యూస్:



త్వరలో జరిగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొనాలని, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అందరి చేత ఓటు హక్కు నమోదు చేసే ప్రక్రియను విజయవంతం చేయాలని నరసన్నపేట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో నరసన్నపేటలో జరిగిన ప్రాంతీయ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు కేవైకుంఠరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆర్ దమయంతి, నరసన్నపేట మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి సుధీర్ కుమార్, కే ఆదినారాయణ పోలాకి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రాజేష్ ,పి ఉమా భాస్కర్ జలుమూరు మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తం తో పాటు దంత లక్ష్మణరావు మన్మధరావు,కె. తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

నరసన్నపేట, అక్టోబర్ 25, మేజర్న్యూస్:

నరసన్నపేట పట్టణంలోని ఎరువులు వ్యవసాయ మందుల దుకాణాలను నరసన్నపేట వ్యవసాయ అధికారిని కె. సునీత శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.



ఈ సందర్భంగా దుకాణాలలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణంలో నిల్వ ఉంచిన ఎరువులను మందులను పరిశీలించి నాణ్యత లేని మందులను విక్రయించరాదని, రైతులకు విక్రయించే ప్రతి ఎరువులు మందులను తప్పనిసరిగా రసీదులు ఇవ్వవలెనని దుకాణదారులకు సూచించారు. రామ రైతు డిపో నందు రెండు ఫెర్టిలైజర్ శాంపుల్ సునాణ్యత పరిశీలన నిమిత్తము ల్యాబ్ కు పంపించారు.

## వరకట్న వేధింపు కేసులో భర్తకు జైలు

నరసన్నపేట, అక్టోబర్ 25, మేజర్న్యూస్:



నరసన్నపేట పోలీస్ స్టేషన్ లో 5. 12. 2022 బోనేల నాగమణి, తన భర్త సాంభశివరావు మానసికముగా, శారీరకంగా హింసిస్తూ, అదనపు కట్నం తెమ్మనమనివేదిస్తున్నట్లు రిపోర్ట్ ఇవ్వగా ఏఎస్ఐ కాంతారావు కేసు నమోదు చేయగా, కేసు దర్యాప్తు చేసి అప్పటి ఎస్ ఐ సింహాచలం ఛార్జ్ షీట్ నరసన్నపేట కోర్టులో ఫైల్ చేయగా, ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ శ్రీమతి రొక్కమ్ శాంతి సంతోషి వాదించిగా, గౌరవ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి సిహెచ్ హరిప్రియ తీర్పు ఇచ్చా రు.ముద్దాయి కి 2 సంవత్సరాలు జైల్ శిక్ష, 10,000 రూపాయలు జరిమానా విధిస్తూ, ఫైన్ 10000 కట్టకపోతే అదనంగా 1 నెల జైల్ శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.ముద్దాయి నీ అదుపులోనికి తీసుకొని ప్రస్తుతం నరసన్నపేట సబ్ జైల్ కు తరలించారు. తదుపరి విశాఖపట్నం సెంట్రల్ జైలు కు తరలించలసి వుంది అని నరసన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్సై సిహెచ్ .దుర్గాప్రసాద్ తెలియచేశారు.

## పెదముషిడివాడలో ..

(మొదటి పేజీ తరువాయి)

భూభకాసురులు మితిమించిన భూకబ్జాలను పెదముషిడివాడ పంచాయతీలో చేపట్టి ప్రభుత్వ భూమి అంటూ లేకుండా చేస్తున్న ఫిర్యాదులు మాత్రం బయటకు రావు. భూ భకాసురులు ఫ్లెక్సీలతో రాజకీయం చేస్తూ తమకు పలుకుబడి ఉందని అంటూ భూ ఆక్రమణలు అడ్డుకోకుండా చూస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న ఇక్కడ ఏ ప్రభుత్వ శాఖ అధికారులు కూడా కనీసం తొంగి చూడరు. ఆక్రమణలు జరుగుతున్న వాటి పని వాటిదే.ఇల్లు నిర్మించుకునే వారికి భూ భకాసురుల అండ ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు తమ కర్తవ్యం నిర్వహణను విస్మ రించుతున్నామనే విషయం కూడా పెద ముషిడి వాడిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు మర్చిపోయారు. దీంతో భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను అమ్మకాలు చేసి కోట్లాది రూపాయలు గడిస్తున్నారు .పేదల ముసుగులో ఇప్పటికే అనేక చోట్ల గెడ్డవాగులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురైన అధికారులు ,ఉద్యోగులు మాత్రం తమ కళ్ళకు గంతలు కట్టుకుని అక్కడేమీ జరగలేదని అంటూ భూ భకాసురులకు వెన్నంటే నిలుస్తున్నారు. జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు ఇచ్చిన తమకు ఏమీ జరగదని భూభాకాసురల అండతో బయటపడవచ్చునే ధీమాతో ప్రభుత్వ సిబ్బంది అధికారులు ఉన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న తమకు పట్టదనే నిర్లక్ష్యంతో ఇక్కడ బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు తమ విధులు నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్న కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న నిఘా వర్గాలు మాత్రం ఈ గ్రామంలో జరుగుతున్న అరాచకాలను ఫ్లెక్సీల రాజకీయంతో ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లలేని పరిస్థితి ఇక్కడ ఏర్పడింది. ప్రభుత్వ భూములు ఆక్రమణ, శాంతిభద్రతల పర్యవేక్షణ వంటి వాటిపై నిఘా ఉంచాల్సిన జిల్లా స్థాయి అధికారులు కూడా ఫిర్యాదులు వెళ్లిన పట్టించుకోలేని పరిస్థితి ఇక్కడ నెలకొంది .ఇప్పటికైనా పరవాడ మండలంలో ప్రధానంగా పెదముషివాడ గ్రామంలో ప్రభుత్వ భూముల కబ్జాను పూర్తిస్థాయిలో తొలగించి, గెడ్డ వాగుల్లో ఆక్రమణలను కూల్చివేసి గెడ్డ వాగులను రక్షించాల్సిందిగా సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## 27న బీచ్‌లో 'విక్టరీ ఎట్ సి' స్తూపంపై లేజర్ షో

(మొదటి పేజీ తరువాయి)

సమీపానగల విక్టరీ ఎట్ సీ స్థూపం పై ఈ లేజర్ షో ను ప్రదర్శించడం జరుగునని కావున ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ప్రజలందరూ ఈ అద్భుతమైన ప్రదర్శనను తిలకించవలసినదిగా జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారని జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు తెలియజేశారు.

## కేజీహెచ్‌లో మేజర్.. ఆమ్యామ్యాల్లో మేనేజర్..!

(మొదటి పేజీ తరువాయి)

స్థాయి ఏ రేంజ్‌లో ఉంటుందో కార్పోరేట్ యాజమాన్యాలను అడిగితే అసలు గుట్టు రట్టవుతోందని కేజీహెచ్‌లో ప్రతీ నోట ఇదే మాట. మెడికల్ రియంబర్స్‌మెంట్ ఫైలు వచ్చిందంటే ఆ శాఖలో పండగే పండగ. జిల్లాలోని ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన కుటుంబ సభ్యులకు చెందిన మెడికల్ రియంబర్స్‌మెంట్ ఫైలును ఈ కార్యాలయానికే పంపిస్తారు. ఆ ఫైలు అటు తిరిగి..ఇటు తిరిగి...మన మేజర్ చెంతకే చేరితే అక్కడి నుంచే అసలు బేరసారాలు సాగి...ఫైళు రాయలేని అనుయాయుల నుంచి వాటిని తీసుకుని అన్నీ తానై చేసుకుపోతారన్న ప్రచారం జరుగుతోంది. ఇంతకీ ఆ అనుయాయులను ఏరి కోరి తెచ్చుకుని తన కనుసన్నల్లో పెట్టుకుని ఏమీ రాదంటూ తిట్టిపోస్తూనే కథ మొత్తం నడిపించే అపర మేధావి మన మేజర్. ఇలా ఆ ఒకటీ రెండూ ఫైళ్లు మాత్రమే కాదు....ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాం టేషన్... హాస్పిటల్ వెరిఫికేషన్...సదరం సర్టిఫికెట్లు...ఇలా ఒక్కటేమిటి...అన్నీ సాదాసీదా పనులు అయితే కాదు.

### ఈ పాపం శివానందమేనా....!

ప్రస్తుతం ఏ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలో అన్నది ఆ సంస్థ అధినేతకే తెలియాలి. మరి ఆ అధినేతే తమకెందుకులే అనుకుంటున్నారో...లేక ఆ మేజర్ చెప్పినట్టూ తలూపుతూ చెప్పిన చోటల్లా సంతకాలు చేసుకుంటూ పోతే అందే కవర్లకు లొంగిపోయారేమోనని వైద్య వర్గాల్లోనే కలవరం మొదలైంది. కూటమి ప్రభుత్వానికి మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్న ఈ బాస్‌ల బాగోతం మరింతగా ముదరకముందే మేల్కొంటే కేజీహెచ్‌కు మళ్లీ పూర్వ వైభవం వచ్చినట్టేనని అంటున్నారు. తప్పులను సరి చేయకుండా కొందరికే వంత పాడుతూ చేసే తప్పులు మరిన్ని తలనొప్పులకు బీజం వేసినట్టేనని భావిస్తున్నారు.

## ట్రాక్టర్ యజమానులే.. అసలు దొంగలు!

(మొదటి పేజీ తరువాయి)

వాహనాల శబ్దాలకు సరిగ్గా నిద్ర పట్టడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. కుటమి ప్రభుత్వం ఇసుక ఉచితమని ఒకపక్క ప్రకటనలు చేస్తున్న.. దేవరాపల్లి మండలంలో మాత్రం పైకం ఇసుక తోలాల్సిందేనని ఇసుక దళారులు దర్జాగా చెబుతున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాకు ట్రాక్టర్ యజమానులే.. అసలు దళారులని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక వ్యవహారంపై ఇద్దరూ ట్రాక్టర్ యజమానులు మాట్లాడుకున్న ఆడియో రికార్డింగ్ చర్వాణిలో హల్చల్ చేస్తుంది.

### ప్రభుత్వ నిబంధనలకు తూట్లు..

ప్రభుత్వ నిబంధనలకు ఈ ఇసుకాసురులు తూట్లు పొడుస్తున్నారు. మండలంలోని ఎక్కడ ఇసుక రీచ్లు గుర్తించలేదు. నదీ తీర ప్రాంతాల్ని పూర్తిగా గోతులమయం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్ లైన్ లో ఇసుక బుకింగ్ 24 గంటలు అవకాశం ఉండాలని చెప్పినప్పటికీ, కొంతమంది ఇసుకాసురులు తమ పంట పండించుకునేందుకు ఆన్ లైన్ బుకింగ్ తో పని లేకుండానే ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. ఇలా ఇసుక తోడిస్తే భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటుతాయని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి అక్రమ ఇసుక దోపిడీదారుల ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ విషయమే స్థానిక అధికారుల వద్ద ప్రస్తావించగా అనుమతులు ఎవరికి ఇవ్వలేదని, ఎవరైనా పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

## కష్టపడే వాళ్లకు గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ విశాఖ తో నాకు అనుబంధం ఉంది. నేను ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదువుకున్నాను. నాపై పెట్టిన బాధ్యతలను అధిష్టానం ఆదేశాల ప్రకారం నిర్వర్తిస్తాను. గత వైసిపి ప్రభుత్వంలో విద్వాంసకర పాలన జరిగింది. నాయకులు విశాఖను దోచుకున్నారు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి అంశాన్ని తూచా తప్పకుండా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాము రాష్ట్రంలో దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి కొందరు నాయకులు త్యాగాలు చేశారు. మూడు పార్టీల లో కష్టపడి పని చేసినవారికి తప్ప కుండా గుర్తింపు ఉంటుంది కేంద్ర ప్రభుత్వ సహకారం రాష్ట్రానికి మెండుగా ఉంది గతంలో విశాఖ నుంచి వెళ్ళిపోయిన లులు మహల్ కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మరలా తిరిగి వస్తుంది జగన్మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాలలో పంచాయతీలకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదు సర్పంచ్ ల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు గత వైసిపి ప్రభుత్వం వైఫల్యల వలన ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు నిన్న జగన్ గుర్ల వచ్చారు ఆ పాపం జగన్ ది ప్రజలు ప్రతిపక్ష హెూదా ఇవ్వకపోయినా ప్రతిపక్ష హెూదాలో ఉన్నట్లు జగన్ మాట్లాడుతున్నారు జగన్మోహన్ రెడ్డి రానున్న ఎన్నికలలో ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా రావు తల్లికి చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ఆడపిల్లల కోసం మాట్లాడు తున్నారు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎప్పుడు పరదాల మాటునే పర్యటనలకు వచ్చేవారు వైసీపీ పార్టీని విడిచి పెట్టి ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు జగన్మోహన్ రెడ్డి వేరే పార్టీలతో కలవడానికి తిరుగు తున్నారు విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా విశ్వవిద్యాలయంలో రాజ కీయాలు చేసి భ్రష్టు పట్టించారు అభివృద్ధి,సంక్షేమమే ధేయంగా ముందుకు వెళుతున్నాము. దోపిడీ దారుదు విజయసాయి రెడ్డిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు నామి నేటెడ్ పదవులు త్వరలో భర్తీ చేస్తాం గత ఐదు సంవత్స రాలు కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది మూడు పార్టీలను సమన్వయం చేసు కుంటూ ముందుకు వెళ్లడంతో కొంత ఆలస్యం అవుతుంది ఉత్తరాంధ్ర జిల్లాలకు విశాఖ స్టీల్ ప్లాంట్ జీవనాడి లాంటిది విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించ వలసిన బాధ్యత మనపై ఉంది మూడు సంవత్సరాలు విశాఖను దోచుకున్న దొంగ విజయసాయిరెడ్డి మరలా విశాఖకు వచ్చారు దోపిడీ దారుదు విజయసాయిరెడ్డి ఢిల్లీ నడివీధులలో మా వల్ల చేతకాదు అని చెప్పిన వ్యక్తి ఇప్పుడు స్టీల్ ప్లాంట్ కోసం నిరాహార దీక్ష చేస్తా మని అంటున్నారు వైసీపీ నాయకుల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మరు ఇంట్లో ఉన్న సమస్యలే పరిష్కరించలేకపోతున్న జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర సమస్య లను ఏం పరిష్కరిస్తారు ముందు ఇంట్లోనే సమస్యను పరిష్కారం చేసుకొని జగన్మోహన్ రెడ్డి బయటకు రావాలి విశాఖలో గత వైసిపి ప్రభుత్వం కుట్రతో రాష్ట్రం లోనే అతి చిన్న జిల్లాగా చేసింది అందరూ కలిసి పనిచేసే విశాఖ జిల్లాలో అభివృద్ధి చేసుకుందాం కూటమి ధర్మాన్ని పాటిస్తూ నాయకులందరం ముందుకు వెళ్దాం. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం శ్రీభారత్ మాట్లాడుతూ విశాఖ ఇంచార్జ్ మంత్రిగా డోలా బాల వీరంజనేయ స్వామి రావడం సంతోషకరం ఇంచార్జ్ మంత్రి అధి కారులతో పని చేయించాలి నామినేటెడ్ పదవులు త్వరగా భర్తీ చేయాలి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టి సి ఎస్ ను తీసుకువచ్చాము విశాఖలో రాత్రి 12 గంటలు వరకు హెూటల్స్ తెరిచి ఉండేలా అనుమతులు తీసుకు వచ్చాము విశాఖ ను ప్రక్కన పెట్టి అన్ని అమరావతిలో పెడుతున్నా రని దుష్ప్రచారం చేస్తున్నారు కూటమి ప్రభుత్వం విశాఖకు ప్రాధాన్యత ఇస్తోంది అందరూ కలసి విశాఖను అభివృద్ధి చేద్దాం అని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి మాట్లాడుతూ విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని మెగా ప్రాజెక్టులు ప్రారంభిస్తే విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు ఎటువంటి ఆర్థిక నేరాలు జరగ కుండా చర్యలు తీసుకోవాలని కోరారు వేగంగా నామినేటర్ పదవులు భర్తీ చేయాలని అన్నారు ఇప్పుడు నామినేటెడ్ పదవులు భర్తీ చేసినట్లయితే ఐదేళ్లలో చాలా మందికి పదవులు ఇచ్చినట్లు అవు తుందని చెప్పారు. శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు,వంశీ కృష్ణ శ్రీనివాస్,గణబాబు,పంచకర్ల రమేష్ బాబు,శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు వేపాడ చిరంజీవిరావు,రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ తదితరులు మాట్లాడారు కార్యక్రమానికి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్య దర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు కార్య క్రమంలో సీతంరాజు సుధాకర్ జనసేన నాయకులు పసుపులేటి ఉషాకిరణ్ వలిసెట్టి తాతాజీ పట్టాభి డాక్టర్ రఘు జిల్లా అధ్య క్షురాలు అనంతలక్ష్మి ఈతలపాక సుజాత బిజెపి నాయకులు కాశిరాజు,నాగేంద్ర కార్పొరేటర్లు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## అవంతి ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫార్మా షూటికల్స్ సైన్సెస్ ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం, అక్టోబర్ 25, మేజర్న్యూస్:



అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా షూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో భీమిలి మండలం, రేఖవానిపాలెం పంచాయతీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఎముకలకు సంబంధించిన వైద్య సేవలు, దంత చికిత్సలు మరియు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరములో సుమారు 200 మంది రోగులకు చికిత్సకు అందించారు. మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమం అవంతి ఎన్. ఎస్. ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో సమన్వయం చేయబడింది. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. ఎమ్. బివి. రాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. ఉమా శంకర్ రావు, ఎన్. ఎస్. ఎస్. సమన్వయకర్త రుషి, సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ గాయత్రి,

